క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



సత్తెనపల్లి:హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జియో స్టోర్ నిర్వాహకుల సహకారంతో ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జియో స్టోర్ నిర్వాహకుడు మహేష్ తండ్రి సంగీతరావు మాట్లాడుతూ అన్నదానం పవిత్రమైన కార్యక్రమమని తెలిపారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఫౌండర్ కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సురేష్, సోమశేఖర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత పాల్గొన్నారు.

60 మద్యం సీసాల స్వాధీనం



అచ్చంపేట: తెలంగాణ నుంచి పులిచింతల ప్రాజెక్టు మీదుగా అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని మాదిపాడు వద్ద చెక్ పోస్టు వద్ద అదుపులోకి తీసుకుని 60 సీసాల్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్. మణికృష్ణ తెలిపారు. మాదిపాడుకు చెందిన షేక్ బాజీ తెలంగాణ నుంచి బైకుపై సీసాల్ని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు చెక్‌పోస్టు వద్ద అచ్చంపేట పోలీసులు కాపుకాసి పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేసి, ఎక్సైజ్ యాక్టు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

క్రైస్తవులపై దాడుల్ని అరికట్టాలి



పెదకూరపాడు: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడుల్ని నిరసిస్తూ సోమవారం పెదకూరపాడు మండల ఉమ్మడి క్రైస్తవ సంఘాల వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ర్యాలీలో కట్టా ప్రసాదరావు, రాజేంద్రకుమార్, నరేష్ కుమార్, ప్రకాష్, శ్యాంసురేష్, మత్తయ్య, రాజు, షడ్రక్, జాన్ వెస్లీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందాపై క్రిమినల్ కేసు నమోదు

అమరావతి: ధరణికోట కోళ్ల ఫారాల్లో రేషన్ పట్టుకున్న సంఘటనపై పౌరసరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ గఫూర్ ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. గత శనివారం ధరణికోటలోని పౌల్ట్రీ ఫారానికి అక్రమంగా తరలిస్తున్న 24 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో తమ్మిశెట్టి గోపి, గుడిశె కోటేశ్వరరావు, ఇర్ల సాయి, వసంత శ్రీనివాసరావు, చేకూరి జాజిబాబు, చేకూరి సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు.

13న వెరికోస్ వెయిన్స్‌పై ఉచిత వైద్య శిబిరం

సత్తెనపల్లి: పట్టణ రోటరీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సౌజన్యంతో ఈనెల 13న పట్టణంలోని శాంతి నికేతన్ జూనియర్ కళాశాల ఆవరణలో వెరికోస్ వెయిన్స్‌పై ఏవీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరు వెంకట హరే రామ చెంచయ్య, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మాతంగి సాంబశివరావు సోమవారం తెలిపారు. బీమా, రియింబర్స్‌మెంటుతో పాటు అన్ని రకాల ప్రైవేట్ ఇన్సూరెన్సులు కూడా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం 9989527715లో సంప్రదించాలని సూచించారు.

నేడు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం 12 గంటలకు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ సోమవారం తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

- సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి ఆదేశం
- ఈనెల 21 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే చేయాలి
- ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం
- సత్తెనపల్లి టౌన్, రూరల్ బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష



పట్టణ ఓటర్ల జాబితా గురించి వివరిస్తున్న కమిషనర్ షమ్మి. వేదికపై ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ సురేష్

సత్తెనపల్లి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు వేర్వేరుగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 21వ తేదీ వరకు బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే కొనసాగించాలని, 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరికీ ఓటుహక్కు కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓటర్లు, చనిపోయిన వారి పేర్లను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. జాబితాలో పేర్లు, ఇంటి నంబర్లు తప్పులున్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్పులు చేయాలని తెలిపారు. దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉండాలో అడిగి అక్కడికి మార్పు చేయాలని చెప్పారు. 18 ఏళ్లు పైబడిన వారు ఓటుహక్కు కోసం బీఎల్‌వోలకు ఆధార్ కార్డు, ఫొటో అందించి నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. జాబితాలో ఫొటోలు తప్పుగా ఉంటే మార్పులు చేసి ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపుతామని తెలిపారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిలను పరిష్కరించి జనవరి 5న తుది జాబితా ప్రచురించనున్నట్లు ఆర్డీవో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్-2024లో భాగమైన ఇంటింటి సర్వే, ఈపీ, జెండర్ రేషియో తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.సురేష్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ముప్పాళ్ల :ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలపై పారదర్శకంగా విచారణ జరిపి వాటిని తొలగించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సోమవారం ఓటర్ల జాబితా డోర్ టు డోర్ తనిఖీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లను గుర్తించి ఫారం-7 ద్వారా తొలగించాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఫారం-6 ద్వారా ఓటు హక్కు కల్పించాలని, జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-8 ద్వారా సవరించాలని సూచించారు. ప్రతి బీఎల్వో రిజిస్టర్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ కల్లా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్. లక్ష్మీప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, కపిల్‌దేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల్ని త్వరితగతిన పూర్తిచేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డెప్యూటీ డీఈవో వేణుగోపాలరావు, సిబ్బంది

నకరికల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని డెప్యూటీ డీఈవో కె.వేణుగోపాలరావు ఉపాధ్యాయులకు సూచించారు. చల్లగుండ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. నాడు–నేడు పనులతో పాటు జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. కిట్ల నాణ్యతతో పాటు మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. కోటి రూపాయలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. పాఠ్య పుస్తకాల్ని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, ఫిజికల్ డైరెక్టర్ సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న విద్యార్థులకు అల్బెండోజోల్ మాత్రల పంపిణీ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకట కృష్ణకుమార్ తదితరులు

రాజుపాలెం: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అల్బెండోజోల్ ట్యాబ్లెట్స్ పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు వెంకటకృష్ణకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటకృష్ణకుమార్ మాట్లాడుతూ మండలంలో రెండేళ్ల నుంచి 19ఏళ్లలోపు వయసు పిల్లలు 7,850 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ట్యాబ్లెట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఎంఈవో మల్లికార్జునశర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, ప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



ముప్పాళ్ల పీహెచ్‌సీలో చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తున్న ఎంపీపీ మారూరి పద్మ

ముప్పాళ్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మారూరి పద్మ తెలిపారు. మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు వ్యాక్సిన్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో భాగంగా ఇంటి వద్దకే వైద్య సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో మిషన్ ఇంద్రధనుస్సు కూడా అమలు చేస్తోందని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి మాట్లాడుతూ మొదటి విడతగా ఈనెల 7నుంచి 12వరకు, రెండవ విడతలో సెప్టెంబర్ 11నుంచి 16వరకు, మూడో విడతలో అక్టోబర్ 9 నుంచి 14వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వ్యాక్సిన్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, సీహెచ్‌వో పి.ఆంజనేయులు, హెల్త్‌సూపర్‌వైజర్లు కె.వి.నాగమల్లేశ్వరరావు, సీహెచ్.భవాని, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో కచ్చితత్వం ఉండాలి

బీఎల్‌వోలకు ఈఆర్‌వో ఆదేశం



మాట్లాడుతున్న వసంతబాబు

చిలకలూరిపేట: ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేని కచ్చితమైన వివరాలతో రూపకల్పనకు బీఎల్‌వోలు చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జి.వసంతబాబు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో పట్టణ, చిలకలూరిపేట మండల పరిధిలోని బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో స్త్రీ, పురుష ఓటర్ల మధ్య వ్యత్యాసం అధికంగా ఉండరాదని వెల్లడించారు. వివాహం జరిగిన స్త్రీల తాలూకు ఓట్లు బదిలీ కాని కారణంగా పురుషుల కన్నా, స్త్రీ ఓట్లు జాబితాలో ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇలాంటివి గుర్తించి వ్యత్యాసం సరిచేయాలన్నారు. మరణించిన వారి, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి కచ్చితమైన సమాచారం సేకరించాలని చెప్పారు. ఓట్లు తొలగించేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత ఓటరుకు నోటీసు జారీచేసి మాత్రమే తొలగించాలన్నారు. ఓట్ల తొలగింపు రెండు శాతానికి మించకుండా చూసుకోవాలన్నారు. చేర్పులకు సంబంధించి నాలుగు శాతానికి మించకుండా చూసుకోవాలన్నారు. ఒకే అడ్రస్‌తో రెండు ఫొటోలతో ఉండటం వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు, చేర్పులు జాగ్రత్తగా చేయాలని తెలిపారు. ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్. గోవిందరావు, తహసీల్దార్ జి. సుజాత, డెప్యూటీ తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ టీపీఎస్ కె.సునీత, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చిలకలూరిపేటటౌన్: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చేనేత వస్త్రాలు ప్రత్యేక పాత్ర పోషించాయని బీసీసంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కాకుమాను రమేష్ చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని మార్కెండేయనగర్‌లో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 50 సంవత్సరాలు చేనేత వృత్తిలో ఉన్నవారిని సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘ అధ్యక్షుడు మనోహర్, సభ్యులు పోలయ్య, సాంబమూర్తి, శివశంకర్ పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సహజ రోగనిరోధకశక్తి



క్రోసూరు: తల్లులంతా పిల్లలకు ఆరుమాసాల వరకు పాలు తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి తెలిపారు. తల్లివారోత్సవాల ముగింపు సందర్భంగా తొమ్మిదో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లులకు అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, రోగనిరోధకశక్తి కూడా సహజంగా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.అనూరాధ, సీహెచ్. విజయనిర్మల, వి.మెరీనా, జి.శివపార్వతి, తల్లులు పాల్గొన్నారు.

అజాదికా అమృతోత్సవం ముగింపు



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల కారుణ్య ఆశ్రమంలో సోమవారం అజాదికా అమృతోత్సవ ముగింపు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కొత్తాల రామలింగస్వామి అవార్డు గ్రహీత డాక్టర్ కేసరి స్వాతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాటిబండ్లలో జన్మించిన స్వాతంత్ర్యోద్యమకారుడు దామరాజు పుండరీకాక్షుడు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కారుణ్య ఆశ్రమ నిర్మాత అల్లం చిన శౌరెడ్డి, డాక్టర్ ఇన్నారెడ్డి, శాంతి, కె. కోటిరెడ్డి, అల్లం స్లీవారెడ్డి, శౌరీలమ్మ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

బొల్లాపల్లి: విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సైదా (33) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామంలోని ఓ ఇంటికి సిమెంటు పనితో మరమ్మతులు చేస్తూ 11 కె.వి.విద్యుత్ లైన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాధితుడ్ని వినుకొండ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్సై జి. రవికృష్ణ తెలిపారు. మృతుడికి భార్య కరిష్మా, ఇరువురు సంతానం ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

నరసరావుపేట టౌన్: కులం పేరుతో దూషించడంతో పాటు అకారణంగా దాడి చేశాడని బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. కోటప్పకొండ రోడ్డు శ్రీనివాస నగర్‌కు చెందిన నవీన్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తుంటాడు. నవీన్‌పై వారం రోజుల క్రితం భాస్కర్‌రెడ్డి దాడికి పాల్పడ్డాడు. విష యంపై నవీన్ అతని స్నేహితులు వెళ్లి ప్రశ్నించగా మరో మారు భాస్కర్‌రెడ్డి దాడికి పాల్పడి దూషించాడు. ఈ మేరకు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసు నమోదు చేశామన్నారు.

'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం'లో కారు పంపిణీ



నరసరావుపేట : వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన కారును ఓ యువకుడికి కలెక్టర్ ఎల్.శివ శంకర్ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని మాదిపాడు గ్రామానికి చెందిన వై.గాబ్రియల్ నవోదయం ప్రోగ్రాంలో తనకు వాహనం కొనుగోలుకు రుణం కావాలని అర్జీ దరఖాస్తు చేశారు. కెనరా బ్యాంక్ సహకారంతో 45 శాతం సబ్సిడీతో డిజైర్ కారు మంజూరు చేశారు. అందులో భాగంగా మంజూరైన కారు తాళాలను కలెక్టర్ లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ కల్పనశ్రీ, నోడల్ ఆఫీసర్ సంజీవరావు, కన్వీనర్ ఓబుల్ నాయుడు, పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎల్‌డీఎం శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పెరుమాళ్ల లక్ష్మీశివన్నారాయణ



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గంతో లక్ష్మీశివన్నారాయణ తదితరులు

సత్తెనపల్లి: సమాజ సేవలో రోటరీ సభ్యులు భాగస్వాములు కావాలని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పెరుమాళ్ల లక్ష్మీశివన్నారాయణ తెలిపారు. రోటరీ క్లబ్ సత్తెనపల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని సోమవారం స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజీలో నిర్వహించారు. తొలుత లక్ష్మీ శివన్నారాయణ నూతన అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి సరికొండ రమాదేవి, కోశాధికారి వనమా నాగేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులు మేరువ అంజిరెడ్డి, ఇందూరి వెంకటేశ్వరరెడ్డితో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ బాపతు శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లక్ష్మీ శివన్నారాయణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడానికి రోటరీ చక్కని వేదికని తెలిపారు. రోటరీ ఇంటర్నేషనల్ సూచించినట్లు నెలవారీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్ మాట్లాడుతూ సమాజసేవలో రోటరీ సభ్యులు భాగస్వాములై, అందరికీ సహకారం అందించాలని కోరారు. అనంతరం రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు సహకారంతో ఐదుగురు పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ పాస్టు ప్రెసిడెంట్లు చందోలు వెంకట మల్లికార్జునరావు, డోగిపర్తి వెంకట సత్యనారాయణ, పాయసం మహేష్‌బాబు, సాయి రమేష్, తుమ్మల వెంకటేష్, షేక్ మాబూ సుబాని, షేక్ గౌస్, మాతంగి రాహుల్ గౌతమ్, శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయ మిత్రులు జాషువా, ఎస్.పి.ప్రసాదరాజు, రమేష్, శివారెడ్డి, శ్రీనివాసరావు, బావనా రుషి, బెల్లంకొండ రమేష్, తురకా రాజు, దిలీప్, డ్యానీ, నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

సత్తెనపల్లి: పెట్టుబడీదారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పాట అనే ఆయుధంతో పోరాటం చేసి, ప్రజల్ని చైతన్యవంతం చేసిన ప్రజా గాయకుడు గద్దర్ అని ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ ఆధ్వర్యంలో సోమవారం గద్దర్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గద్దర్ నిరంతరం బాధితుల పక్షాన నిలబడుతూ వాళ్ల చైతన్యం కోసం ఒగ్గు కథ రాసి ఆంధ్ర రాష్ట్రమంతా ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు కోరబండి అంథోని, అంబేడ్కర్ ప్రజా సంఘం అధ్యక్షుడు దావులూరు కోటేశ్వరావు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెళ్ల పాల్ రాజ్, బీఎస్పీ నాయకులు కుక్కమల్ల దేవానంద్, సీఎల్‌సీ సంయుక్త కార్యదర్శి శిఖరం చిన్న, యు. రాణి, పీకేఎం, పీడీఎం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె మస్తాన్‌వలి, నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం, గిరిజన సంఘం నాయకుడు వి.కోటనాయక్, న్యాయవాదులు ఎం. వేదాద్రి, సయ్యద్ అబ్దుల్ రహీం, బత్తిన శ్రీనివాస్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట ఆనంద్, కంభంపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ తుమ్మలగుంట రామకృష్ణ, మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు జంగాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు గుజ్జర్లపూడి కన్నా, బండారు ఆమోస్, గుజ్జర్లపూడి అబ్రహం, జెట్టి శేఖర్, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

పటిష్ట చట్టాలతోనే మహిళలకు రక్షణ

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రమాదేవి

సత్తెనపల్లి: చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమైన మద్యం, మత్తు పదార్థాలు, అసభ్యకర సీరియల్స్, అశ్లీల చిత్రాల్ని అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి డిమాండ్ చేశారు. మహిళలపై హింస, మద్యం, మత్తు పదార్థాలరహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ గత నెల 28న సత్యసాయి జిల్లాలో బయలుదేరిన మహిళా పోరుయాత్ర సోమవారం సత్తెనపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తాలూకా సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు ఐద్వా సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ అధ్యక్షత వహించారు. రమాదేవి మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మణిపూర్లో మహిళలపై జరిగిన ఘటన పరాకాష్ట కాదా? అని ప్రశ్నించారు. అశ్లీల, మద్యం వ్యతిరేక ఉద్యమ నాయకులు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ అశ్లీల చిత్రాల్ని ప్రచురిస్తున్న పత్రిక యజమానులపై కేసులు పెట్టి శిక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా సత్తెనపల్లిలోకి వచ్చిన మహిళా పోరు యాత్రకు స్థానిక మహిళలు డప్పుల దళంతో వెళ్లి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు బృందం మహిళా చైతన్య పాటల్ని ఆలపించారు. ఈ సందర్భంగా ×పొత్తికడుపులో అమ్మ ఉన్నది×అనే పాటకు ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి. శ్రీనివాస కుమారి, గుంటుపల్లి రజని, పట్టణ అధ్యక్షురాలు మునగా జ్యోతి, కమిటీ సభ్యులు షేక్ ఆయేషా, కట్టా రమాదేవి, ఎం.రమాకుమారి, జి.నాగలక్ష్మి, ఆర్.శివపార్వతి, జి ఎలిసెమ్మ, కుమారి, కోటమ్మ, అనూష, లక్ష్మి, అమూల్య, సుజాత పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై చైతన్యం కల్పించాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారి కాట్రగడ్డ గిరిధర్ కుమార్



మాట్లాడుతున్న వైద్యాధికారి గిరిధర్

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరూ ఫ్లోరోసిస్ బారిన పడకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరిసిస్ వైద్యాధికారి కాట్రగడ్డ గిరిధర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణపై వైద్య ఆరోగ్య సిబ్బంది సమీక్షించారు. ఈ సందర్భంగా గిరిధర్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 439 గ్రామాలు ఉండగా అందులో శావల్యాపురం మండలంలో 24 గ్రామాలను ఫ్లోరోసిస్ గ్రామాలుగా గుర్తించామన్నారు. ప్రతీ లీటరు మంచినీటిలో 1 మిల్లీగ్రాం ఫ్లోరోసిస్ మించరాదన్నారు. ప్రభుత్వం గతంలో మెడ బెల్ట్‌లు 1600, నడుము బెల్ట్‌లు 1100, వాకింగ్ కర్రలు 600, వీల్‌చైర్లు కుర్చీలు 21 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడే వారిని గుర్తించి సత్వరమే వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో అర్హత కలిగిన లబ్ధిదారుల సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదు చేయటం ద్వారా వాకింగ్ కర్రలు, మెడ బెల్టులు, నడుము బెల్ట్‌లు, వీల్‌చైర్లు ప్రభుత్వ పరంగా మంజూరు చేస్తామన్నారు. దంతాలు, ఎముకల పటిష్టత తదితర వాటిని పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, రెండవ వైద్యాధికారి యం.రాధాకృష్ణన్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, సాయిగీతా, ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.